## క్లుప్తంగా

### పోతవరం పీహెచ్‌సీలో వైద్య శిబిరం



వైద్యశిబిరంలో మందులు తీసుకుంటున్న రోగులు

**నల్లజర్ల:** మండలంలోని పోతవరం పీహెచ్‌సీలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని పోతవరం సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు ప్రారంభించారు. శిబిరంలో సాధారణ వైద్య సేవలతో పాటు ఎముకలు, చెవి, ముక్కు,గొంతు, నేత్ర, ప్రసూతి, చర్మ వ్యాధులకు సంబంధించి 245 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పెండ్యాల హరేరామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు పాపా నాగేశ్వరరావు, చిడిపి చింతయ్య హాజరయ్యారు. పోతవరం పీహెచ్‌సీ డాక్టరు వెంకట్రావు, ఎంహెచ్‌ఈఓ పలివెల సత్యం, పీహెచ్ఎన్ ఇందిర, సూపర్‌వైజర్లు జమీలా, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలు అందించారు.

### బొండు ఇసుక తరలింపు వాహనాల సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్‌తో యజమానులు

**పెరవలి:** అనుమతి లేకుండా మండలంలోని కానూరు వద్ద గోదావరి లంకలో మంగళవారం అర్ధరాత్రి బొండు ఇసుక తరలింపునకు వినియోగిస్తున్న ఓ పొక్లెయిన్‌ను, ఒక ట్రాక్టర్‌ను రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సీజ్ చేశారు. అధికారుల రాకను గమనించిన ఆ రెండు వాహనాల డ్రైవర్లు అక్కడి నుంచి పరారయ్యారు. దాంతో వాటి యజమానిని, రైతును దోషులుగా భావించి పెరవలి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై బుధవారం ఉదయం వారిద్దరిపైనా కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎస్సై ఎం.సూర్య భగవాన్ ధ్రువీకరించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ద్వారకాతిరుమల:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మండలంలోని కొమ్మర గ్రామానికి చెందిన మానూరి వెంకన్న (60) మృతి చెందాడు. ఈ ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. వెంకన్న ఈనెల 17 సాయంత్రం ద్వారకాతిరుమలలోని తన జీడిమామిడి తోటలో పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతున్నాడు. కొమ్మర శివార్లలోని కుమ్మరి చెరువు వద్ద ఎదురుగా వచ్చిన ఒక స్కూటీ అతడి బైక్‌ను వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకన్నను స్థానికులు, కుటుంబ సభ్యులు ఆటోలో ముందుగా ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

### చెరుకు ట్రాక్టర్, లారీ ఢీ: ట్రాఫిక్‌కు అంతరాయం



ప్రమాద ఘటనా దృశ్యం

**గోపాలపురం:** మండలంలోని గుడ్డిగూడెం రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న లారీ, చెరుకు ట్రాక్టర్ బుధవారం ఢీ కొన్నాయి. చెరకు ట్రాక్టర్ బోల్తా పడింది. దాంతో రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గోపాలపురం నుంచి జంగారెడ్డిగూడెం వెళుతున్న చెరుకు ట్రాక్టర్‌ను రాజమహేంద్రవరం నుంచి జంగారెడ్డిగూడెం వెళుతున్న లారీ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు వచ్చి, చెరుకు ట్రాక్టర్‌ను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

### విధులు ముగించుకుని ఇంటికి వెళుతూ..

**కొవ్వూరు:** ధర్మవరం సమీపంలో బుధవారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన దేశాబత్తుల వెంకట్రావు (39) దుర్మరణం చెందాడు. కొవ్వూరులోని ఓ బార్‌లో సప్లయర్‌గా పని చేస్తున్న వెంకట్రావు విధులు ముగించుకుని బైక్‌పై ఇంటి వెళుతున్నాడు. ధర్మవరం శివార్లలో బైక్ అదుపు తప్పడంతో అతడు కింద పడిపోయారు. తలకు బలమైన గాయమై, నెత్తురు ప్రవించిన వెంకట్రావు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇంధనం ఆదా

- పెరుగుతున్న ఈ- వాహనాల విక్రయాలు
- లైసెన్స్, రిజిస్ట్రేషన్ అవసరం లేదు
- చిన్న పట్టణాల్లో సైతం షోరూమ్‌ల ఏర్పాటు

**కొవ్వూరు:** పెట్రోలు ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. ఈ క్రమంలో వాహనదారులు ఎలక్ట్రికల్ బైక్‌ల వైపు అడుగులు వేస్తున్నారు. ఇంధన ఖర్చులు ఆదా చేసుకునే అవకాశం ఉండడంతో సామాన్య, మధ్యతరగతి వర్గాల వారు ఈ-వాహనాల పట్ల ఆసక్తి చూపుతున్నారు. పట్టణాలు, నగరాల్లో రోజువారీ కార్యకలాపాల కోసం 20 నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణించే వారందరూ ఇప్పుడు ఈ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో చిన్న పట్టణాల్లో సైతం ఈ-వాహనాలు విక్రయించే షోరూములు వెలుస్తున్నాయి. సుమారు పదికి పైగా కంపెనీలు ఈ-వాహనాలను తయారు చేస్తున్నాయి. రూ.60 వేల నుంచి రూ.80 వేల రేటులో వివిధ రకాల మోడళ్లు లభ్యమవుతున్నాయి. రోజుకు మూడు నుంచి నాలుగు గంటల పాటు చార్జింగ్ పెడితే, సామర్థ్యాన్ని బట్టి 60 నుంచి 120 కిలోమీటర్ల వరకూ మైలేజీ వచ్చే వాహనాలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.క్రమంగా గ్రామీణులు సైతం వీటిపై మక్కువ చూపుతున్నారు. ఇటీవల నల్లజర్ల, కొవ్వూరు, నిడదవోలు వంటి పట్టణాల్లోను షోరూములు వెలిశాయి. సాధారణంగా ఇంటి నుంచి ఆఫీసుకి వెళ్లి రావడం, పిల్లలను స్కూల్లో దింపి, సాయంత్రం తీసుకు రావడానికి, పొలానికి వెళ్లి వచ్చేందుకు ఈ-వాహనాలు అనువుగా ఉంటున్నాయని వినియోగదారులు చెబుతున్నారు.

**ఇంధన ఖర్చులు ఆదా**

**పెట్రోల్‌తో నడిచే వాహనం కొనాలంటే ఇపుడు రూ.లక్ష నుంచి రూ.1.50 వరకూ ఖర్చవుతోంది. లీటర్ పెట్రోల్‌కు 35 నుంచి 50 కిలోమీటర్ల మైలేజ్ మాత్రమే వస్తున్నాయి. అంటే ఒక్కో కిలోమీటరుకు రూ.2.25 నుంచి రూ.2.50 వరకూ ఖర్చవుతోంది.** అదే ఈ-వాహనం అయితే యూనిట్ నుంచి యూనిట్‌న్నర విద్యుత్తు చార్జి, అంటే రూ.10 కే 60 నుంచి 120 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. కేవలం కిలోమీటరుకు 15 నుంచి 20 పైసల లోపు ఖర్చవుతుంది. యూనిట్ కరెంట్ రేటు రూ.6.50. ఈ లెక్కన ఎలక్ట్రికల్ బైక్ వినియోగిస్తే నెలకు రూ.300 లోపు కరెంటుకు ఖర్చవుతుంది. అదే పెట్రోలు కోసం రూ.3,000 వరకూ ఖర్చు చేయాలి. పైగా ఈ-వాహనానికి బ్యాటరీ, మోటార్ మాత్రమే ఉంటాయి. దాంతో తక్కువగా రిపేర్లు వస్తాయి. రోజుకు వంద కిలోమీటర్లు తిరిగే వాహనదారులకైతే దాదాపు రూ.10 వేల వరకూ ఇంధన వ్యయం ఆదా అవుతుంది. పైగా ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్ అవసరం కూడా ఉండదు.



కొవ్వూరులోని షోరూమ్‌లో వివిధ రంగుల్లో ఎలక్ట్రికల్ మోటార్ సైకిళ్లు

**పెరుగుతున్న వినియోగం**

పట్టణాల్లోను, పల్లెలోను క్రమంగా ఈ-వాహనాల వినియోగం పెరుగుతోంది. ఒక్కో షోరూమ్‌లో నెలకి సరాసరిన పది వాహనాలు అమ్ముడవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం నల్లజర్ల, కొవ్వూరు, నిడదవోలు షోరూమ్‌ల ద్వారా గత ఏడాదిలో దాదాపు 300 వాహనాలను విక్రయించినట్టు చెబుతున్నారు.

**ఆదరణ పెరిగింది**



ఇటీవల ఈ-వాహనాలకు ఆదరణ పెరిగింది. పెట్రోలు ఖర్చు భారం మారడం,రిజిస్ట్రేషన్, లైసెన్స్ అవసరం లేకపోవడంతో వాహనదారులు వీటిపై మక్కువ చూపుతున్నారు. నామమాత్రపు ఖర్చుతో ప్రయాణించే ఛాన్స్ ఉండడంతో అన్ని వర్గాల ప్రజలు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది అమ్మకాలు బాగున్నాయి.

– కారుపాటి సుదర్శన్ ధనరాజ్‌కుమార్ (రాజు), షోరూమ్ యాజమాని, కొవ్వూరు

**ఖర్చు నామమాత్రం**



పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. గత ఆగస్టులో ఎలక్ట్రికల్ బైక్ కొనుగోలు చేశాను. కరెంట్‌కు నెలకు రూ.300 మించి ఖర్చవడం లేదు. ఒకసారి చార్జింగ్ పెడితే 70 నుంచి 80 కిలోమీటర్లు వస్తోంది. ఒక రోజు చార్జింగ్ పెడితే మూడు రోజుల పాటు వస్తుంది. నిత్యం స్కూలు వెళ్లి వచ్చిన తర్వాత స్థానికంగానూ ఆ వాహనంపై తిరుగుతున్నాం.

– టీఎంఎన్ఎస్ శ్రీనివాస్, వాహనదారుడు, కొవ్వూరు

**నెలకు రూ. మూడు వేల ఆదా**



గతంలో బైక్ పెట్రోల్‌కు మాకు నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకూ ఖర్చయ్యేది. ఏడాది క్రితం ఈ-వాహనం కొనుగోలు చేశాం. నా భర్త ఉదయాన్నే ఆ బైక్‌పై పిల్లలను స్కూల్‌కి తీసుకెళ్లి ఉద్యోగానికి వెళుతున్నారు. సాయంత్రం స్కూల్ నుంచి పిల్లల్ని తీసుకు వస్తున్నారు. పట్టణంలో ఏదైనా అవసరం ఉంటే ఈ- వాహనాన్ని వాడుకుంటున్నాం. కరెంట్ బిల్లు నెలకు రూ.200 పెరిగింది.

–ఎల్.లక్ష్మి, గృహిణి, కొవ్వూరు

## సులభ్ కాంప్లెక్స్.. తాళం తీస్తే ఒట్టు..?

**కొవ్వూరు:** కక్షిదారులు, ప్రజల అవసరాల కోసం స్థానిక కోర్టు ప్రాంగణంలో కొవ్వూరు మునిసిపాలిటీ నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు (సులభ్ కాంప్లెక్స్) నిరుపయోగంగా మారాయి. సొమ్ము చెల్లించి వినియోగించుకునేలా మునిసిపాలిటీ మొదట్లో ఇక్కడ ఒక మనిషిని ఏర్పాటు చేసింది. ఆ వ్యక్తికి కూలి సొమ్ము కూడా రాకపోవడంతో వదిలేశారు. దీంతో మునిసిపల్ అధికారులు ఈ మరుగుదొడ్లకు తాళాలు వేశారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ మరుగుదొడ్లు సుమారు మూడేళ్లకు పైగా మూతపడి ఉన్నాయి. ఇదే ప్రాంగణంలో పట్టణ పోలీసు స్టేషన్, సబ్ ట్రెజరీ ఆఫీసు, జిల్లా తొమ్మిదో అదనపు కోర్టు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ప్రిన్సిపల్ సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు, సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, తహసీల్దార్ కార్యాలయం, బార్ అసోసియేషన్ భవనం ఉన్నాయి.



కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మూతపడి ఉన్న సామూహిక మరుగుదొడ్లు

నిత్యం వందలాది మంది వివిధ పనులపై ఇక్కడి వస్తుంటారు. మరుగుదొడ్డి వసతి లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## రోడ్లు మెరుగు పడ్డాయి.. బస్సులు పునరుద్ధరించండి

**తాళ్లపూడి:** మండల కేంద్రమైన తాళ్లపూడి మీదుగా గతంలో నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో కొన్నింటిని నిలిపి వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ద్వారకాతిరుమలకు వయా తాళ్లపూడి, గోపాలపురం, కొయ్యలగూడెం మీదుగా బస్సు సర్వీసు ఉండేది. అలాగే ఏలూరుకు వయా తాళ్లపూడి, గోపాలపురం, చిన్నాయిగూడెం మీదుగా బస్సులు నడిచేవి. దొండపూడి మీదుగా భీమోలు, గోపవరం సర్వీసు, దొండపూడి–భీమోలు సర్వీసులు నడిచేవి. మండలంలోని అన్నదేవరపేట వెళ్లడానికి ఒక్క బస్సు కూడా లేదు. భీమోలు, సూరయ్యపేట నుంచి, దొండపూడి, గోపవరం గ్రామాల నుంచి తాళ్లపూడి రావడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరోనా సమయంలో కొన్ని, రోడ్లు బాగాలేవని మరికొన్ని బస్సు సర్వీసులను రద్దు చేశారు. ప్రస్తుతం మండలంలో రోడ్లు మెరుగుపడ్డాయి.



తాళ్లపూడి మీదుగా వెళుతున్న ఆర్టీసీ బస్సు

అయినప్పటికీ బస్సు సర్వీసులను పునరుద్ధరించలేదు. మరో దారిలేక తాము ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుంటే వారు రూ.40 నుంచి రూ.50 వరకు చార్జి చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. కాగా ఉదయం పూట బడి బస్సు పేరుతో కొన్ని సర్వీసులను నడుపుతున్నారు.

## ఎరువుల కొరత ఉంటే ఫోన్ చేయండి

- పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి
- జిల్లా వ్యవసాయ శాఖాధికారి మాధవరావు

**కొవ్వూరు:** ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాలోని రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. రైతులకు ఎక్కడైనా ఎరువుల కొరత ఏర్పడితే కంట్రోల్ రూమ్ నంబర్ 83310 56668కు ఫిర్యాదు చేయాలని సూచించారు. చాగల్లు రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఆయన ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఈ ఏడాది రబీ సీజన్‌కు అన్ని రకాల ఎరువులు కలిపి 99,255 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయన్నారు. కాగా ఇప్పటి వరకూ 89,,351 మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేశామని చెప్పారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా



చాగల్లు రైతు భరోసా కేంద్రంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న మాధవరావు

19,255 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.దీనిలో యూరియా 8,142, డీఏపీ 1,230, ఎంఓపీ 2,089, కాంప్లెక్స్ ఎరువులు 6,102, ఎస్ఎస్‌పీ 1,692 మెట్రిక్ టన్నులు రైతు భరోసా కేంద్రాలు, ఆథరైజ్డ్ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని మాధవరావు వివరించారు.

## ఐదు గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి

**చాగల్లు:** భూముల సమగ్ర రీ సర్వేతో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలన్నీ పరిష్కారం అవుతాయని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.నిరంజన్ అన్నారు. వైఎస్సార్, జగనన్న శాశ్వత భూ హక్కు –భూ రక్ష పథకంలో భాగంగా కలవలపల్లి గ్రామంలో బుధవారం డ్రోన్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటికే ఐదు గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందన్నారు. డ్రోన్ సర్వే పూర్తయిన గ్రామాలకు 15 రోజుల్లో ఓఆర్ఐ మ్యాప్‌లు వస్తాయని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ మాట్లాడుతూ ప్రతి భూమికి మ్యాప్, ఆధార్ తరహాలో 14 అంకెల యూనిక్ నంబర్ కేటాయిస్తామన్నారు. భూములను అత్యాధునిక సాంకేతిక విధానంలో సర్వే చేసేందుకు



కలవలపల్లిలో డ్రోన్ సర్వేకు సమాయత్తం అవుతున్న రెవెన్యూ సిబ్బంది

డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నామని చెప్పారు. సచివాలయ సిబ్బంది, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి సాగుతో పుడమికి మేలు

**పెరవలి:** ప్రకృతి వ్యవసాయం ద్వారా ఒనగూరే ప్రయోజనాలను రైతులకు వివరిస్తూ మండలంలోని ఖండవల్లి గ్రామంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ మహేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతి రైతూ పాటిస్తేనే భూమికి మేలు జరుగుతుందన్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందుల పిచికారీ వల్లే నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించలేకపోతున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని రైతులు ఆసక్తి చూపిస్తున్నారని ఆయన చెప్పారు. గతంలో 1000 ఎకరాల్లో సాగయ్యే ప్రకృతి వ్యవసాయం ఇపుడు మూడు వేల ఎకరాలకు విస్తరించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుజ్జి, వెంకట్రావు, విద్యాలత, రత్నరాజు, మహేష్, ప్రసాద్, రవి, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

**నల్లజర్ల:** 'నేలకు నవ ధాన్యాలు' పేరుతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని



ఖండవల్లిలో అవగాహన ర్యాలీ చేస్తున్న రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది

కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ యం.ఉమామహేశ్వరరావు అన్నారు. సహజసిద్ధంగా భూసారం పెంపుపై బుధవారం శింగరాజుపాలెం, మారెళ్ళమూడి గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎం తాతారావు, ఎల్‌టూ కనకదుర్గ, ఐబీఐసీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### చిలకపాడులో 100 మందికి వైద్య సేవలు

**ఉండ్రాజవరం:** మండలంలోని చిలకపాడులో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 సంచార వాహనం ద్వారా ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ఉషారాణి 100 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అలాగే చిలకపాడు పాఠశాల విద్యార్థులకు రక్త పరీక్షలు, ఎత్తు, బరువులను చూసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జె.శ్రీనివాసు, కె.నాగమణి, దుర్గా మల్లీశ్వరి తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు

**నిడదవోలు రూరల్:** అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహార లోపం రాకుండా చర్యలు తీసుకోవాలని సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.అమరేంద్ర సూచించారు. సమిశ్రగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు బుధవారం ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. పిల్లల బరువును పరీక్షించి రక్తహీనత పరీక్షలు చేశారు. బలహీనంగా ఉన్న చిన్నారులు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తల్లిదండ్రులకు సూచించారు. అవసరమైన వారికి ఐరన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఈఓ ఎ.రాజమోహన్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## దినకర్మకు వెళ్లి వస్తూ కానరాని లోకానికి..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- ఇద్దరూ సీతానగరం మండల వాసులు

**కొవ్వూరు:** పట్టణ శివార్లలో బుధవారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో సీతానగరం మండలం చినకొండేపూడికి చెందిన మొయ్యేటి నాని (30) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో సీతానగరంలోని కొత్తపేటకు చెందిన జొన్నకూటి ప్రసన్న కుమార్ అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. వారిద్దరూ తాళ్లపూడి మండలం బల్లిపాడులో బుధవారం జరిగిన ఓ దినకర్మకు హాజరై, మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కొవ్వూరు పట్టణ శివార్లలో వారు లారీని ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న మొయ్యేటి నాని తలకు బలమైన గాయం కావడంతో, తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ నడుపుతున్న ప్రసన్నకుమార్ తలకు బలమైన గాయం కావడంతో అతడిని 108లో తొలుత కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి



మొయ్యేటి నాని మృతదేహం

నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, తర్వాత కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. నాని మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## బీఎఫ్‌ఎఫ్‌తో కలిసి ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్లు

మత్స్యశాఖ ఏడీ సైదా నాయక్

**కొవ్వూరు:** చేపల వినియోగాన్ని పెంచడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఫిష్ ఆంధ్ర మినీ రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తున్నామని మత్స్యశాఖ కొవ్వూరు ఏడీ బి.సైదానాయక్ అన్నారు. పట్టణంలో మహిళా సమాఖ్య భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేపలు, రొయ్యలు, పీతల వంటి వాటితో తయారయ్యే పలు రకాల ఉత్పత్తులను స్నాక్స్, పచ్చళ్లుగా తయారు చేసి విక్రయించి, వాటి వినియోగాన్ని పెంచనున్నామన్నారు. అవుట్ లెట్లు, ఫుడ్ కోర్టులు, ఫిష్ ఆంధ్రా మినీ రెస్టారెంట్ల ఏర్పాటుకు హైదారాబాద్‌కు చెందిన బెస్ట్ ఫ్రెష్ ఫ్రెష్ (బీఎఫ్ఎఫ్) అనే సంస్థ బ్రాండింగ్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తోందన్నారు. అవసరమైన సామాగ్రిని, ముడి సరుకును ఆ సంస్థ సమకూరుస్తుందన్నారు. మార్కెటింగ్, ప్రచారం వంటి అంశాలను కూడా ఆ సంస్థ చూస్తుందన్నారు. రూ.10 లక్షల డైలీ ఫార్మెట్‌కు, రూ.20 లక్షలు సూపర్ ఫార్మెట్‌కు, రూ.50 లక్షల కిసాన్ లాంజ్ స్కీముల ద్వారా అందిస్తున్నామన్నారు. బీసీలకు నలభై శాతం, ఎస్టీలకు అరవై శాతం సబ్సిడీ అందిస్తున్నామన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా, వెలుగు ఆధ్వర్యంలో అవుట్ లెట్లను ఏర్పాటు చేయనున్నట్లు ఏడీ తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ ఏడీ సైదానాయక్

### స్పందన అర్జీల పరిష్కారంపై సమీక్ష

**నిడదవోలు రూరల్:** స్పందనలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారాలు చూపి అర్జీదారులను సంతృప్తి పరచాలని తహసీల్దార్ ఎం.గంగరాజు సూచించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ అర్జీదారులు పదేపదే స్పందన కార్యక్రమానికి రాకుండా సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. సచివాలయ ఉద్యోగుల హాజరుపై ఎంపీడీఓ, కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ఎంపీడీఓ టి.మూర్తిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### బీసీ నాయకుడు 'తానింకి'కి సన్మానం



తానింకి గంగరాజును సత్కరిస్తున్న దృశ్యం

**గోపాలపురం:** ఇటీవల ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయ పాలకమండలి సభ్యుడిగా నియమితుడైన మండలంలోని పెద్దాపురానికి చెందిన బీసీ నాయకుడు తానింకి గంగరాజును బుధవారం బీసీ నాయకులు సత్కరించారు. గోపాలపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న 18 స్థానాల్లో వైఎస్సార్ సీపీ తరపున 11 స్థానాలకు బీసీలను అభ్యర్థులుగా ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎం.సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ తానింకి సత్యనారాయణ, వారపు శశికుమార్, దూలం ముత్తయ్య నాయుడు పాల్గొన్నారు.

### ఏప్రిల్ 23 నుంచి మోదుగులమ్మ జాతర

**తాళ్లపూడి:** తాళ్లపూడి గ్రామ దేవతైన మోదుగులమ్మ జాతరను ఏప్రిల్ 23 నుంచి 25 వరకూ నిర్వహిస్తామని జాతర కమిటీ సభ్యులు నిర్ణయించారు. జాతర ఏర్పాట్లపై గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తాళ్లపూడిలో బుధవారం సమావేశమయ్యారు. ఏప్రిల్ 26న అమ్మవారికి గ్రామస్తులు నైవేద్యాలు సమర్పిస్తారన్నారు. సమావేశంలో గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు నామన పరమేశ్వరరావు, నక్కా చిట్టిబాబు, సింహాద్రి జనార్దనరావు, వంబోలు పోశిబాబు, జడ్డు శ్రీను, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు మైగాలపు సంపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### పరీక్ష సామగ్రి అందజేత

**దేవరపల్లి:** మండలంలోని త్యాజంపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు దాత పఠాన్ అక్బర్‌ఖాన్ బుధవారం పరీక్ష సామగ్రిని అందజేశారు. పాఠశాల హెచ్ఎం వి.విరాట్ పాల్గొన్నారు.

**గోపాలపురం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆ కళాశాల ఇంగ్లిషు లెక్చరర్ ఈదూరి గంగరాజు తన సొంత ఖర్చులతో బుధవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.రఫీక్ అహ్మద్, లెక్చరర్లు గోవాడ జాన్ పీటర్, జి నిర్మలకుమారి, ఎంవీడీ భవాని, జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### క్రైస్తవుల శ్రమ దినాల ప్రారంభం

**నిడదవోలు రూరల్:** క్రైస్తవులు పవిత్రంగా నిర్వహించే గుడ్ ఫ్రైడే వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో భస్మ బుధవారంగా పిలిచే ఈ బుధవారాన్ని ప్రారంభించి గుడ్‌ఫ్రైడ్ వరకూ శ్రమ దినాలు జరుగుతాయి. ఈ సందర్భంగా సమిశ్రగూడెం, డి.ముప్పవరం, తాడిమళ్ల, సింగవరం గ్రామాల్లోని విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

### ఆలయ గార్డుపై శునకం దాడి

**ద్వారకాతిరుమల:** శ్రీవారి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఒక సెక్యూరిటీ గార్డుపై బుధవారం రాత్రి శునకం దాడి చేసింది. ఈ ఘటనలో గాయపడ్డ సెక్యూరిటీ గార్డు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందాడు. వివరాలివి. శ్రీవారికి రాత్రి హారతి ఇచ్చే సమయంలో ఒక శునకం ఆలయంలోకి ప్రవేశించబోయింది. అయితే ఆ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న దేవస్థానం సెక్యూరిటీ గార్డు ఎం.శ్రీనివాస్ ఆ శునకాన్ని ఆలయంలోకి వెళ్లకుండా వారించాడు. దాంతో ఆ శునకం అతడిపై దాడి చేసింది.